
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 14 జూన్ 2024



- సీఎం చంద్రబాబు ఐదు సంతకాలపై హర్షం
- డీఎస్సీతో మారనున్న నిరుద్యోగుల దశ
- పింఛన్ పెంపుపై అంతటా ఆనందం
- ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుతో ఊరట
- అన్నక్యాంటీన్ల పునరుద్ధరణపై సంతోషం



ఇక మంచి రోజులే

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఐదేళ్ల తర్వాత మంచి రోజులు వచ్చేశాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారు. రాష్ట్రంలో 16వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం పెట్టారు. సామాజిక పింఛన్లు రూ.4వేలకు పెంపు దస్త్రంపై మూడో సంతకం, అన్నక్యాంటీన్ల పునరుద్ధరణపై నాలుగు, నైపుణ్య గణనపై ఐదో సంతకం చేశారు. ఇలా.. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ప్రాధాన్యం గల ఐదింటిపై చంద్రబాబు సంతకాలు చేయడంతో అన్నివర్గాల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నిరుద్యోగులు, రైతులు, వృద్ధులు, ప్రజలంతా చంద్రబాబు నిర్ణయానికి జేజేలు పలుకుతున్నారు.

● నిరుద్యోగులకు మారనున్న దశ..

డీఎస్సీపై తొలి సంతకం చేయడంతో.. ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులంతా హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో డైట్, బీఈడీ పూర్తిచేసినవారు సుమారు 15వేల మంది ఉన్నారు. వైసీపీ సర్కారు సచివాలయ పోస్టులు భర్తీచేసి డీఎస్సీని ఊరిస్తూ ఐదేళ్లు గడిపేసింది. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు జల్లింది. నిరుద్యోగులు కసితో వైసీపీని ఓడించి ఎన్డీయే కూటమిని గెలిపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు సీఎం చంద్రబాబు డీఎస్సీపై తొలి సంతకం చేయడంతో త్వరలో నోటిఫికేషన్ వెలువడనుంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 3వేల పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది. తమ దశ మారనుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని నిరుద్యోగులు చెబుతున్నారు.

● పింఛన్‌దారుల్లో మరింత సంతోషం

సామాజిక పింఛన్ పెంపుతో ఆయా లబ్ధిదారులకు మరింత ఆసరా లభించనుంది. 2014లో సీఎం చంద్రబాబునాయుడు.. వృద్ధులకు పింఛన్‌ను రూ.200 నుంచి రూ.వెయ్యికి పెంచారు. కొద్దినెలల్లోనే ఆ మొత్తాన్ని రూ.2 వేలు చేశారు. వృద్ధుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతూ ఐదేళ్లలో కేవలం రూ.వెయ్యి మాత్రమే పెంచింది. ఎన్నికల హామీల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు తాజాగా.. పింఛన్‌ను రూ.4వేలకు పెంచారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇది వర్తించేలా చేస్తామని చెప్పారు. మూడు నెలలకు రూ.4వేలతో పాటు జూలై పింఛన్ రూ.4వేలు.. మొత్తంగా రూ.7వేలు అందజేయనున్నారు. జిల్లాలో వృద్ధులు 1,71,602 మంది, వితంతువులు 74,652, నేత కార్మికులు 3,524, కల్లు గీత కార్మికులు 1,878 మంది, ట్రాన్స్‌జెండర్స్ 57 మంది పింఛన్‌దారులు ఉన్నారు. మత్స్యకారులు 7,218 మంది, ఒంటరి మహిళలు 10,085 మంది, డప్పు కళాకారులు 1,949 మంది, చర్మకారులు 555 మంది, కళాకారులు 276మంది పింఛన్‌దారులు ఉన్నారు. వారంతా పింఛన్ పెంపుపై మరింత సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

● రైతులు.. భూయజమానులకు ఊరట

ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దుతో రైతులు, భూ యజమానులకు ఊరట కలుగనుంది. ఈ యాక్ట్ ఎంతటి దుర్మార్గంగా ఉంటుందో.. జగన్ తీసుకున్న నిర్ణయం వల్ల భూయజమానులు, రైతులకు వాటిల్లే నష్టాన్ని సమగ్రంగా ఎన్నికల ప్రచారంలో టీడీపీ, జనసేన నేతలు వివరించి సక్సెస్ అయ్యారు. తాము సంపాదించుకున్న భూములపై జగన్ పెత్తన మేంటన్నది భూ యజమానులందరూ జగన్ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. అధికారంలోకి రాగానే ల్యాండ్‌టైటలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని చెప్పిన చంద్రబాబు.. ఇచ్చిన మాట నిలబెట్టుకునే దిశగా సంతకం చేయడం తో.. రైతులు. భూయజమానుల ఆనందాలకు అవధుల్లేవు.

● అతిత్వరలో 'అన్నక్యాంటీన్'లో భోజనం

అన్నక్యాంటీన్లు అతిత్వరలో తెరచుకుని.. చాలామంది పేదలకు రూ.5కే కడుపునిండా భోజనం లభించనుంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకాకుళం, పలాస, ఆమదాలవలస, ఇచ్ఛాపురం, టెక్కలిలో అన్నక్యాంటీన్లను నెలకొల్పారు. శ్రీకాకుళం, పలాసలో వేలాదిమంది ప్రతిరోజు క్యాంటీన్‌లను వినియోగించుకునేవారు. చిరుద్యోగులు, మహిళలు, కూలీలు, కార్మికులు, విద్యార్థులు.. వీళ్లందరూ రూ.5తో అన్నక్యాంటీన్‌లో భోజనం చేసేవారు. వైసీపీ ప్రభుత్వం కొలువుతీరాక అన్నక్యాంటీన్‌లను మూసివేసింది. జగన్ తీసుకున్న తుగ్లక్ నిర్ణయాన్ని సాధారణ ప్రజలందరూ వ్యతిరేకించారు. అలాగే శ్రీకాకుళంలో అన్నక్యాంటీన్‌ను తీసివేయించి.. ఆ ప్రాంతంలో వైసీపీ నాయకులు రెస్టారెంట్ నిర్వహించారు. ఆ రెస్టారెంట్‌కు ఆదరణ లేకపోవడంతో మూసివేసేశారు. తాజాగా 'అన్నక్యాంటీన్‌లు పునరుద్ధరణ' కోసం చంద్రబాబునాయుడు సంతకం చేయడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శ్రీకాకుళంలో.. వైసీపీ పాలనలో మూతపడిన అన్నక్యాంటీన్

ఆనందంగా ఉంది



ఐదేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తూనే ఉన్నాం. గత ప్రభుత్వంలో నిరుద్యోగుల కోసం ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా లేకపోవడంతో నిరాశ చెందాం. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డీఎస్సీపై తొలి సంతకం చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాం.

- హేమంత్, సోంపేట

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. పింఛన్ రూ.4వేలు అందజేసేలా దస్త్రంపై సంతకం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు. పింఛన్ పెంపు మెరుగైన జీవనానికి వినియోగపడుతుంది. పింఛన్‌దారులమంతా చంద్రబాబుకు రుణపడి ఉంటాం.

-టి.హేమావతి, వితంతు పింఛనుదారులు, కాశీబుగ్గ

కల నెరవేరనుంది



50ఏళ్లకే పింఛన్ ఇస్తామని చంద్రబాబు ప్రకటించడంతో ఎంతో ఆనందించాం. ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంపుపై సీఎం చంద్రబాబు సంతకం చేయడంతో.. మా కల నెరవేరనుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితికి ఊతం లభిస్తుంది. చంద్రబాబు మాటిస్తే.. దానిని నిలబెట్టుకుంటారనే దానికి ఇదే ఉదాహరణ. చంద్రబాబుకి జీవితాంతం రుణపడి ఉంటాం.

- బగాది జగన్నాథం, రాధావల్లభాపురం, టెక్కలి

నిరుద్యోగులకు ఊరట



డీఎస్సీ ద్వారా నియామకాల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నాం. వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ నియామకాల్లో వైఫల్యం చెందింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వచ్చిన మరుక్షణమే డీఎస్సీపై మొదటి సంతకం పెట్టడం హర్షణీయం. మాలాంటి నిరుద్యోగులకు ఎంతో ఊరట కలిగించింది.

- గుజ్జారు సత్యనారాయణ, డమర, టెక్కలి

ఆశలు చిగురించాయి



డీఈడీ, బీఈడీ కోర్సులు రెండింటినీ పూర్తిచేసి ఆరేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నాను. సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసిన వెంటనే మెగా డీఎస్సీపై సంతకం చేయడం ఆనందంగా ఉంది. ఎంతోమంది నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి.

- పి.అన్నాజీరావు, అరిణాంఅక్కివలస, ఎచ్చెర్ల

మాట నిలబెట్టుకున్నారు



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సామాజిక పింఛనును నెలకు రూ.4 వేలకు పెంచడం ఎంతో ఆనందంగా ఉంది. 2014-19 సంవత్సరాల మధ్య ముఖ్యమంత్రిగా చంద్రబాబు రూ.200 నుంచి రూ.2వేలకు పెంచి మాకు ఆర్థిక భరోసా ఇచ్చారు. తాజాగా.. పింఛన్‌ను రూ.4వేలకు పెంచి.. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.

- బండి తవిటమ్మ, ధర్మవరం, ఎచ్చెర్ల

యాక్ట్ రద్దు హర్షణీయం



ఎన్నికల హామీ ప్రకారమే ముఖ్యమంత్రి పదవి చేపట్టిన వెంటనే నారా చంద్రబాబు నాయుడు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేయడం హర్షణీయం. పేద, సామాన్య ప్రజలతో పాటు న్యాయస్థానాల ఉనికికి చేటు కలిగించేలా వైసీపీ ప్రభుత్వం రహస్యంగా తీసుకువచ్చిన జీవో 512 ద్వారా చేసిన చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించాం. న్యాయవాదులు చేపట్టిన సుదీర్ఘ పోరాటానికి స్పందించి.. ఆ యాక్ట్ రద్దు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు.

- నాగరాజుపాత్రో, న్యాయవాది, ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఇచ్ఛాపురం

చంద్రబాబు ఆశలు నింపారు



ఐదేళ్లు జాబ్‌క్యాలెండర్ అంటూ జగన్మోహనరెడ్డి మోసం చేశారు. నేను డైట్ పూర్తిచేసి చాలా ఏళ్లు గడుస్తోంది. ఉపాధ్యాయ పోస్టు సాధించాలన్న తపన ఉంది. కానీ గడిచిన ఐదేళ్లలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఇప్పుడు చంద్రబాబు సీఎం కాగానే.. మెగాడీఎస్సీపై సంతకం చేసి నిరుద్యోగుల్లో ఆశలు నింపారు.

- ఏ.సంపతికుమారి, హిరమండలం

మూడేళ్ల నుంచి ఎదురుచూశా



టీచర్ ట్రైనింగ్ పూర్తిచేసి మూడేళ్లు గడిచింది. మూడేళ్ల నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూశాను. నిరాశే మిగిలింది. చంద్రబాబు అధికారంలోకి రావడంతో.. మాలో ఆశలు చిగురించాయి. టీచర్ పోస్టు సాధించేందుకు ఇప్పటినుంచే పరీక్షకు సిద్ధమవుతాం.

- పిల్లి అక్షయ, ఇచ్ఛాపురం

వైసీపీ మోసం చేసింది



నేను 2008లో బీఈడీ పూర్తిచేశాను. 2012, 2014, 2018లో డీఎస్సీకి హాజరయ్యాను. ఆతర్వాత వచ్చిన వైసీపీ డీఎస్సీ నిర్వహించలేదు. ఉపాధ్యాయ కొలువుకోసమే నిరీక్షిస్తున్న నావంటివారందరినీ వైసీపీ మోసం చేసింది. ఇప్పుడు మెగా డీఎస్సీతో మాలో ఆనందం కలుగుతోంది.

- సీపాన చిన్నికృష్ణ, సరుబుజ్జిలి

బతుకుపై ఆశ కలిగేలా..



వయసుపైబడి ఏపని చేయలేక నెలవారీ పింఛన్‌తో మందులు.. సొంత ఖర్చులను నెట్టుకొస్తున్నాం. వృద్ధుల బతుకుల్లో ఆశలు నింపేలా పింఛన్‌ను రూ.4వేలకు పెంచడం ఆనందంగా ఉంది. వృద్ధుల ఆశీర్వాదం చంద్రబాబునాయుడుకి లభిస్తుంది.

- కోరాడ రామయ్య, నిద్దాం, జి.సిగడాం

ఆనందం.. మాటల్లో చెప్పలేం



వయసుపైబడి ఇంటికే పరిమితమైన మావంటివారి కోసం జీవితాల్లో వెలుగులు నింపేలా ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే నిర్ణయం తీసుకున్నారు. బాబు అధికారంలోకి రాగానే పెన్షన్ పెంచడం... మా ఆనందాన్ని మాటల్లో చెప్పలేం.

- డబ్బురి సత్యవతి, ఇచ్ఛాపురం

పింఛన్ పెంపుతో లబ్ధి



పింఛన్ పెంపు నిర్ణయంతో వృద్ధుల కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. నిత్యావసరాలతో పాటు.. మందుల ధరలు భారీగా పెరిగిపోయాయి. సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం మహాదానందంగా ఉంది.

- రెల్ల అప్పన్న, రిక్షాకార్మికుడు, హిరమండలం

మెగా డీఎస్సీ కోసమే..



నేను ఎంఎస్సీ, బీఈడీ పూర్తిచేశాను. గత ప్రభుత్వం డీఎస్సీ ఇస్తుందేమో అని ఎదురుచూశాం. కానీ నిరుద్యోగుల గురించి ఆలోచనచేయలేదు. మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పిన చంద్రబాబుని ఓట్లువేసి గెలిపించుకున్నాం. టీచర్ కొలువు చేపట్టేందుకు అహర్నిశలు శ్రమిస్తా.

- మళ్లా రవికుమార్, పాతపట్నం

ఉద్యమం ఫలించింది



వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన భూ యాజమాన్య చట్టాన్ని రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేయడం శుభపరిణామం. భూ హక్కు చట్టం రద్దు కోరుతూ న్యాయవాదులు చేసిన ఉద్యమం ఫలించింది. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- బొడ్డేపల్లి మోహన్‌రావు, ఆలిండియా లాయర్స్ యూనియన్ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఆమదాలవలస

విమానయాన శాఖ మంత్రిగా
రామ్మోహన్‌నాయుడు బాధ్యతల స్వీకరణ

అరసవల్లి, జూన్ 13: ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా గురువారం ఢిల్లీలో రాజీవ్‌గాంధీ భవన్‌లో బాధ్యతలు చేపట్టారు. రామ్మోహన్‌నాయుడు తన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం విమానయాన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తనపై నమ్మకంతో ఇంత చిన్న వయసుల్లో బాధ్యతలు అప్పగించినందుకు ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు, జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. విమానయానాన్ని సామాన్య పౌరులకు అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తామన్నారు. సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతో ప్రయాణికులకు మరింత భద్రత, సౌకర్యవంతమైన ప్రయాణం కల్పిస్తామన్నారు. టైర్-2, టైర్-3 నగరాల్లో విమానాశ్రయాలు నెలకొల్పడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్ణీత లక్ష్యం కన్నా ముందే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సహాయమంత్రి మురళీధర్ మోహోల్, పౌర విమానయాన శాఖ కార్యదర్శి వి.వాల్నమ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ఆగని ఇసుక దందా

- మడపాం, బుచ్చిపేటల్లో రాత్రివేళల్లో అక్రమ తవ్వకాలు
- 14 లారీలను పట్టుకున్న సెబ్ అధికారులు
- పాత ముఠాసభ్యుల పనేనని గుర్తింపు



మడపాం వద్ద సెబ్ అధికారులు పట్టుకున్న ఇసుక లారీలు

నరసన్నపేట, జూన్ 13: ఇసుక అక్రమాలకు అలవాటు పడిన ముఠా సభ్యులు.. కొత్త ప్రభుత్వం కొలువుదీరినా వారి దందాలు ఆపడం లేదు. నరసన్నపేట మండలంలో వంశధార నదితీర గ్రామాల్లో రాత్రి సమయాల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. ఎన్నికల వేళ.. ఓట్ల లెక్కింపు వరకు గోపాలపెంట కేంద్రంగా ఇసుక అక్రమ తవ్వకాలు సాగాయి. గత నాలుగు రోజులుగా నరసన్నపేట మండలం బుచ్చిపేట కేంద్రంగా రాత్రివేళల్లో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. బుచ్చిపేటతోపాటు.. మడపాం, కరజాడ, బైరి తదితర ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి టీడీపీ శ్రేణులు తరలివెళ్లడంతో.. ఇదే అదునుగా కొత్తపేట, బుచ్చిపేటకు చెందిన పాతగ్యాంగ్ సభ్యులు ఒక్కటై యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారు. రోజుకు 70 లారీల వరకు లోడ్ చేసి.. విశాఖకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

అక్రమ తవ్వకాలు ఇలా..

విశాఖపట్నం నుంచి వచ్చిన లారీలను మడపాం టోల్ గేట్, శ్రీకాకుళం మండలం బైరిలోని పెట్రోల్ బంకు పక్కనవే బ్రిడ్జి వద్ద పార్కింగ్ చేస్తున్నారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో బుచ్చిపేట ఇసుక ర్యాంపు వద్దకు వీటిని తీసుకొచ్చి.. 20 లారీల చొప్పున లోడింగ్ చేస్తున్నారు. ఒక్కో లారీ ఇసుక లోడింగ్‌కు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు తీసుకుంటున్నారు. లారీల్లోకి ఇసుకను లోడ్ చేసి జాతీయ రహదారిపై ఎక్కించే వరకు ముఠా సభ్యులదే బాధ్యత. మడపాం టోల్‌గేట్ వద్ద ఇద్దరు.. ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఇద్దర్ని ఏర్పాటు చేశారు. లారీ ఇసుక ర్యాంపు నుంచి బయల్దేరిన సమయంలో ముందు ద్విచక్రవాహనం.. వెనుక కారుతో ముఠా సభ్యులు ఫాలో అవుతుంటారు. అక్రమ రవాణా అడ్డుకున్న వారికి లారీకి రూ.500 చొప్పున చెల్లించి మడపాం టోల్‌గేట్ దాటిస్తారు. పెట్రోలింగ్ వాహనాలు కూడా ఈ లారీలను చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

అంతా పాత ముఠాసభ్యులే..

మడపాం, బుచ్చిపేట గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాల వెనుక పాత ముఠా సభ్యుల హస్తం ఉంది. గత ప్రభుత్వ హయంలో ఇసుక ర్యాంపు వద్ద మిషనరీలను పెట్టిన వారే ఈ తతంగం అంతా నడిపిస్తున్నారు. బుచ్చిపేటకు చెందిన ఇసుక డాన్‌గా పేరు పొందిన ఒకరు. కొత్తపేటకు చెందిన ఇద్దరు. మడపాం చెందిన మరో ముగ్గురు... కరజాడ, బైరికి చెందిన పలువురు.. అంతా ఒక్కటై రాత్రి సమయంలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు.

రంగంలో దిగిన సెబ్ అధికారులు..

మడపాం, బుచ్చిపేట ఇసుక ర్యాంపుల్లో అక్రమ తవ్వకాలపై స్థానికులు సెబ్ అధికారులకు సమాచారం ఇచ్చారు. గురువారం ఉదయం సెబ్ అధికారులు ఇసుక ర్యాంపులను పరిశీలించి.. అక్రమంగా తరలిస్తున్న 14లారీలను పట్టుకున్నారు. మరో ఆరు లారీల్లో ఇసుక లేకపోవడంతో విడిచిపెట్టారు. ఇసుక ముఠాసభ్యులు ఒక్కో లారీకి రూ.40వేలు ఇస్తామని సెబ్ అధికారులతో బేరాలకు దిగారు. ఆ సమయంలో అక్కడకు విలేకరులు చేరడంతో అక్రమార్కులు పరుగులు తీశారు. అనంతరం ఇసుక లారీలను నరసన్నపేటకు తీసుకువచ్చి పోలీసులకు అప్పగించారు. లారీలను సీజ్ చేసి కేసులు నమోదు చేశామని సెబ్ సీఐ సతీష్, కావ్య తెలిపారు.

ఇక మాకు దిక్కెవరయ్యా?

- ఒక్కగానొక్క కొడుకు మృత్యువాత
- ఉపాధి కోసం వెళ్లి.. అగ్నికి ఆహుతై..
- కువైట్‌లో సిక్కోలు యువకుడి మృతి
- ఇటీవలే ఊరికి వచ్చి తిరిగి వెళ్లి..
- విధుల్లో చేరిన కొద్ది గంటలకే ప్రమాదం

ఒక్కగానొక్క కొడుకు. చేతికంది వచ్చినోడు. కువైట్ నుంచి ఇటీవలే ఊరికి వచ్చాడు. కుటుంబంతో సరదాగా గడిపాడు. ఉపాధి కోసం మళ్లీ బయల్దేరి వెళ్లాడు. విధుల్లో చేరిన కొద్దిగంటలకే విధి వక్రించింది. నిద్రిస్తుండగా అగ్నిప్రమాదం జరిగింది. ఆ అగ్నికీలల్లో ఆహుతై పోయాడు. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. తల్లిదండ్రులకు అంతులేని శోకాన్ని మిగిల్చాడు. 'మాకు దిక్కెవరయ్యా' అంటూ వారు రోదిస్తుంటే మనసు కలచివేసింది.

శ్రీకాకుళం, జూన్ 13(ఆంధ్రజ్యోతి)/ సోంపేట: సోంపేట మండలం జింకిభద్ర గ్రామానికి చెందిన చిరంజీవులు, నారాయణమ్మ దంపతులకు ఏకైక కుమారుడు తామాడ లోకనాథం. పదోతరగతి వరకు చదువుకున్నాడు. ఇద్దరు అక్కాచెల్లెళ్లు. వారికి వివాహాలయ్యాయి. ఇప్పుడు తల్లిదండ్రుల బాధ్యతలన్నీ ఇతనిపైనే. దీంతో మూడేళ్ల క్రితం కువైట్‌కు వెళ్లాడు. అక్కడ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఇటీవలే గ్రామదేవత సంబరాలకుగాను కువైట్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. కుటుంబంతో ఆనందంగా గడిపాడు. స్నేహితులతో కువైట్ విశేషాలు పంచుకున్నాడు. ఎన్నికల్లో ఓటు కూడా వేశాడు. ఫలితాలు వెలువడిన తర్వాత ఈనెల ఈనెల 8న బయల్దేరి వెళ్లాడు. హైదరాబాద్ నుంచి 11వ తేదీ విమానం ఎక్కాడు. కువైట్‌లో దిగి తాను పనిచేస్తున్న క్యాంపు కార్యాలయానికి వెళ్లి అక్కడే పడుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున అక్కడ అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో మంటల్లో చిక్కుకుని నిద్రలోనే మృతి చెందాడు. లోకనాథం కుటుంబానికి పెద్దదిక్కుగా ఉంటాడనుకున్న ఆ కుటుంబం.. మృతి వార్త విని నిర్ఘాంతపోయారు. వారం క్రితం వరకు తమతో ఆనందంగా గడిపాడని, వీలైతే మళ్లీ వస్తానంటూ చెప్పి బయల్దేరి వెళ్లాడని, ఇక తిరిగి రాకుండానే పోయాడని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఒక్కగానొక్క కొడుకు చనిపోవడంతో తమకు దిక్కెవరంటూ వారు వాపోయారు. లోకనాథం మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది. ఇటీవలే తమ మధ్య గడిపినవాడు ఇక లేడనేసరికి బంధువులు, స్నేహితులు తట్టుకోలేకపోతున్నారు. కువైట్ నుంచి మృతదేహం రాకకోసం ఎదురు చూస్తున్నారు.



లోకనాథం(ఫైల్)



రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్

దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జేఎన్ఏఎఫ్ఏయూ)- 'ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఏడీఈఈ) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(బీఎఫ్ఏ), బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీ.డిజైన్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

కోర్సులు-సీట్లు: బీఎఫ్ఏ కోర్సులో అయిదు స్పెషలైజేషన్లు ఉన్నాయి. రెగ్యులర్ కేటగిరీలో అప్లయిడ్ ఆర్ట్ 35, పెయింటింగ్ 20, స్కల్ప్చర్ 10, ఫొటోగ్రఫీ 30 సీట్లు ఉన్నాయి. ఎస్ఎస్ఎస్ కేటగిరీలో అప్లయిడ్ ఆర్ట్ 15, పెయింటింగ్ 15, స్కల్ప్చర్ 10, యానిమేషన్ 60, ఫొటోగ్రఫీ 20 సీట్లు ఉన్నాయి.

● బీ.డిజైన్ కోర్సులో ఇంటీరియర్ డిజైన్ స్పెషలైజేషన్ ఉంది. ఇందులో ఎస్ఎస్ఎస్ కేటగిరీ కింద 60 సీట్లు ఉన్నాయి.

ఎఫ్ఏడీఈఈ వివరాలు: ఎగ్జామ్‌లో భాగంగా ఎ, బి, సి, డి, ఇ, ఎఫ్ పేపర్లు ఉంటాయి. బీఎఫ్ఏ(అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్చర్, యానిమేషన్) ప్రోగ్రామ్‌లకు ఎ, బి, సి పేపర్లు; బీఎఫ్ఏ(ఫొటోగ్రఫీ) ప్రోగ్రామ్‌కు డి, ఇ పేపర్లు;



బీ డిజైన్(ఇంటీరియర్ డిజైన్) ప్రోగ్రామ్‌నకు ఎఫ్ పేపర్ రాయాల్సి ఉంటుంది.

● ఎ-పేపర్‌లో మెమొరీ డ్రాయింగ్ అండ్ కలరింగ్ ఎగ్జామ్ ఉంటుంది. దీనికి 100 మార్కులు కేటాయించారు. పరీక్ష సమయం గంటన్నర

● బి-పేపర్‌లో ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు. దీనికి 50 మార్కులు ఉంటాయి. పరీక్ష సమయం 50 నిమిషాలు

● సి-పేపర్‌లో ఆబ్జెక్ట్ డ్రాయింగ్ ఎగ్జామ్ ఉంటుంది. దీనికి 100 మార్కులు కేటాయించారు. పరీక్ష సమయం గంటన్నర

● డి-పేపర్‌లో 100 మార్కులకు కంపోజిషన్ అండ్ విజువల్ కమ్యూనికేషన్ ఎగ్జామ్ ఉంటుంది. పరీక్ష సమయం గంటన్నర

● ఇ-పేపర్‌లో 50 మార్కులకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం 50 నిమిషాలు

● ఎఫ్-పేపర్‌లో 200 మార్కులకు డిజైన్ సంబంధిత ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం మూడు గంటలు.

● ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 35 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 4
- **హాల్ టికెట్ల డౌన్‌లోడింగ్:** పరీక్షకి నాలుగు రోజుల ముందు
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎఫ్ఏడీఈఈ తేదీలు:** బీఎఫ్ఏ(ఫొటోగ్రఫీ), బీ.డిజైన్(ఇంటీరియర్ డిజైన్) ప్రోగ్రామ్‌లకు జూలై 20; బీఎఫ్ఏ(అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్చర్, యానిమేషన్) ప్రోగ్రామ్‌లకు జూలై 21
- **వెబ్‌సైట్:** www.jnafauadmissions.com, www.jnafau.ac.in

తెలంగాణ డీఈఈ సెట్ నోటిఫికేషన్

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్య విభాగం - డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీ డీఈఈ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలు సహా ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, మైనారిటీ, నాన్ మైనారిటీ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రతి ప్రైవేట్ కళాశాలలో 80 శాతం 'ఎ' కేటగిరీ సీట్లు, 20 శాతం 'బి' కేటగిరీ సీట్లు ఉంటాయి. ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లతోపాటు 'ఎ' కేటగిరీ సీట్లను సింగిల్ విండో సిస్టమ్ ద్వారా 'బి' కేటగిరీ సీట్లను కళాశాలల యాజమాన్యం నిర్ణయం మేరకు భర్తీ చేస్తారు. 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. అభ్యర్థుల వయసు 2024 సెప్టెంబరు 1 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

టీజీ డీఈఈ సెట్ వివరాలు: డీఈఈ సెట్‌ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. డీఈఎల్ఈడీ ప్రోగ్రామ్ ఈ మూడు మాధ్యమాల్లో అందుబాటులో ఉంది. అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్ కోసం ఎంచుకొన్న మాధ్యమంలోనే డీఈఈ సెట్ రాయాల్సి ఉంటుంది. డీపీఎస్ఈ ప్రోగ్రామ్ ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఉంటుంది. ఇందులో చేరాలనుకొనేవారు డీఈఈ సెట్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలోనే రాయాలి. ఆంగ్ల మాధ్యమంలో డీఈఈ సెట్ రాస్తే రెండు ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి అవకాశం ఉంటుంది.

● డీఈఈ సెట్‌ను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం వంద ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ అండ్ టీచింగ్ ఆప్టిట్యూడ్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. రెండో పార్ట్‌లో జనరల్ ఇంగ్లీష్ నుంచి 10, జనరల్ తెలుగు(తెలుగు మాధ్యమం అభ్యర్థులకు)/జనరల్ ఉర్దూ (ఉర్దూ మాధ్యమం అభ్యర్థులకు) నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో ఎగ్జామ్ రాసేవారికి జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 ప్రశ్నలు, జనరల్ తెలుగు/జనరల్ ఉర్దూ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. మూడో పార్ట్‌లో మేథమెటిక్స్ నుంచి 20, ఫిజికల్ సైన్సెస్ నుంచి 10, బయలాజికల్ సైన్సెస్ నుంచి 10, సోషల్ స్టడీస్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. రెండో పార్ట్‌లో జనరల్ ఇంగ్లీష్, జనరల్ తెలుగు/జనరల్ ఉర్దూ ప్రశ్నలను ఆ భాషల్లోనే ఇస్తారు. మిగిలిన రెండు పార్ట్‌లలో అన్ని ప్రశ్నలనూ అభ్యర్థులు ఎంచుకొన్న మాధ్యమంలో ఇస్తారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** deecet.cdse.telangana.gov.in/

సివిల్స్ ప్రిలిమ్స్ ప్రశ్నలు 'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/BJhswiqలో చదవండి.

ముందుగానే దేవర రాక



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దేవర'. గురువారం చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ చిత్రంలో తొలి భాగం 'దేవర: పార్ట్ 1'ను అక్టోబర్ 10న విడుదల చేస్తున్నట్లు గతంలో చిత్రబృందం ప్రకటించింది. అయితే ఇప్పుడు విడుదల తేదీ ముందుకు మారింది. సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు గురువారం తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ఎన్టీఆర్ మాస్ లుక్‌లో కనిపించారు. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, నరైన్ కీలకపాత్రలు పోషించారు. మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

'జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం'



ప్రేమ కథల్లో ఎక్కువగా నటించే సుధీర్‌బాబు.. రూటు మార్చి నటించిన కంప్లీట్ యాక్షన్ ప్యాక్డ్ చిత్రం 'హరోం హర'. ఈ చిత్రానికి జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించగా, సుమంత్.జి.నాయుడు నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా హీరో సుధీర్‌బాబు మీడియాతో ముచ్చటించారు. "హరోంహర' సరికొత్తగా చేసిన కమర్షియల్ సినిమా. ప్రేక్షకులకు ఈ కథా నేపథ్యం, మాటలు, సన్నివేశాలు కొత్త ప్రపంచాన్ని చూసిన అనుభూతిని ఇస్తాయి. నా దృష్టిలో కమర్షియల్ సినిమాల్లో కథ హీరో నుంచి మొదలైతేనే బాగుంటుంది. ఈ సినిమాను 'జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం' అనొచ్చు. ఇందులో నేను పోషించిన సుబ్రమణ్యం పాత్ర అన్ని వర్గాల ప్రేక్షకులకి నచ్చుతుంది. ఇప్పటివరకూ తెలుగులో వచ్చిన పది ఉత్తమ యాక్షన్ చిత్రాల్లో 'హరోం హర' ఒకటిగా మిగిలిపోతుందనే నమ్మకం ఉంది. హీరోయిన్ మాళవిక శర్మ తన పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయింది" అని చెప్పారు.

ఈ ప్రశంసలు ఊహించలేదు



వంశీ జొన్నలగడ్డ దర్శకత్వంలో నూతన నటీనటులతో రూపొందిన చిత్రం 'నీ దారే నీ కథ'. ప్రియతమ్ మంతిని, విజయ విక్రాంత్, అనంత పద్మశాల, వేద్, అంజన బాలాజీ ప్రధాన పాత్రల్లో నటించారు. వంశీ జొన్నలగడ్డ, తేజేష్ వీర, శైలజ జొన్నలగడ్డ నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీమియర్ షో ఏర్పాటు చేశారు. ఈ షో ముగిశాక డైరెక్టర్ వంశీ మాట్లాడుతూ "సంగీతంలో అనుకున్నది సాధించడం కోసం నలుగురు యువకులు చేసే ప్రయత్నాల్ని అందర్నీ ఆకట్టుకునేలా, ఎంతో ఆసక్తికరంగా చూపించారని.. ప్రీమియర్‌లో సినిమాను చూసిన ప్రేక్షకులందరూ ప్రశంసిస్తున్నందుకు ఆనందంగా ఉంది. అందరూ సినిమాను ఇంతగా ఆదరిస్తారని అస్సలు ఊహించలేదు. థియేటర్లలోనూ ప్రేక్షకులు ఇదే విధంగా సినిమాను ఆదరిస్తారని కోరుకుంటున్నాను" అని అన్నారు.

బాలల పోరాటం



చిత్తజల్లు ప్రసాద్ దర్శకత్వంలో కేపీ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'బాలతేజం'. దిలీప్ రాథోడ్, ఇరిగే రమేష్, హీరోయిన్‌లుగా అరవింద, షన్ను, చెన్నకేశవ నాయుడు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గురువారం ఈ సినిమా షూటింగ్ కూకట్‌పల్లి-ఆల్విన్ కాలనీలో ప్రారంభమైంది. డ్రగ్స్ సరఫరా చేసి యువతను నిర్వీర్యం చేస్తున్న ముఠాపై బాలలు చేసిన పోరాటమే ప్రధాన ఇతివృత్తంగా సినిమా ఉంటుందని డైరెక్టర్ చిత్తజల్లు ప్రసాద్ తెలిపారు.

రేవ్‌పార్టీ కేసులో నటి హేమకు బెయిల్



బెంగళూరు రేవ్‌పార్టీ కేసులో అరెస్ట్ అయి జైలు జీవితం గడుపుతున్న నటి హేమకు ఊరట లభించింది. బుధవారం ఆమెకు బెయిల్ లభించింది. రేవ్ పార్టీలో డ్రగ్స్ వాడకంపై బెంగళూరు ఎన్‌డీపీఎస్ కోర్టులో విచారణ జరిగింది. "హేమ డ్రగ్స్ వాడినట్లు పోలీసులు ఎలాంటి సాక్ష్యాలు న్యాయస్థానానికి సమర్పించలేదు' అని ఆమె తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. హేమపై ఆరోపణలు వచ్చిన పది రోజుల తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించారని, ఆమెకు నెగెటివ్ వచ్చిందని, ఆమె వద్ద ఎలాంటి డ్రగ్స్ లభించలేదు అని న్యాయవాది కోర్టుకు నివేదించారు. సీసీబీ (బెంగళూరు నేర నియంత్రణ దళం) న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ, 'హేమ మరికొంత మంది టాలీవుడ్ సినీ ప్రముఖులను ఈ పార్టీకి తరలించే ప్రయత్నం చేశారు, నోటీసులు పంపినా అనారోగ్య కారణాలను సాకుగా చూపి విచారణకు హాజరుకాలేదు, అందువల్లే ఆమెను అరెస్ట్ చేయాల్సి వచ్చింది' అని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి హేమకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ఆమె ఏ క్షణంలోనైనా విడుదలయ్యే అవకాశాలున్నాయి. అరెస్ట్ తర్వాత తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ హేమ సభ్యత్వాన్ని రద్దు చేసింది.

అందాల రాక్సీ వచ్చింది



నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలుగా నటిస్తున్నారు. గురువారం దిశా పుట్టిన రోజు సందర్భంగా యూనిట్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమె రాక్సీ అనే పాత్ర పోషిస్తున్నట్లు తెలిపింది. ట్రైలర్‌లో పోరాట ఘట్టాల్లో మెరిసిన దిశా ఈ పోస్టర్‌లో సైతం పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/XvNanAq లో చదవండి.


నందిగాం: చంద్రబాబును అభినందిస్తున్న పద్మావతి


అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బగ్గు రమణమూర్తి, కలమట వెంకటరమణ


సంతబొమ్మాళి: కొల్లు రవీంద్రను సన్మానిస్తున్న మత్స్యకార నాయకులు

సీఎం, మంత్రులకు అభినందన

- శుభాకాంక్షలు తెలియజేసిన టీడీపీ నాయకులు
- మంత్రుల దృష్టికి జిల్లాలో సమస్యలు

పదవీ బాధ్యతలు స్వీకరించిన సీఎం, పలువురు మంత్రులను జిల్లాలోని టీడీపీ, పలు సామాజిక వర్గాల నాయకులు గురువారం కలిసి, అభినందించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు.

● **నందిగాం:** ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడుకు తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి మెట్ట పద్మావతి అభినందించారు. ఈ మేరకు అమరావతిలో చంద్రబాబును కలిశారు. కాగా టీడీపీ నాయకులు పి.అజయ్‌కుమార్, పి.చంద్రశేఖర్, ఎం.బాలకృష్ణ, కె.ప్రసాదరావు, ఎం.మోహనరావు, ఎస్.కృష్ణారావు, జీరు నానీరెడ్డి, మదన్‌గౌడ్, నాగరాజు, ఉమామహేష్, గిరిబాబు, విశ్వనాథం, ధర్మారావు, ఎస్.జానకిరాం, ఎం.నాగరాజు తదితరులు మంత్రివర్గంలో అచ్చెన్నకు అవకాశం కల్పించడంపై హర్షం వ్యక్తంచేశారు.

● **టెక్కలి/నరసన్నపేట/మెళియాపుట్టి/హిరమండలం:** మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ప్రమాణస్వీకరణ అనంతరం కుటుంబ సభ్యులతో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ విజయవాడలో కలిశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేఎల్ఎన్ ప్రసాద్, పూతిరమణ, నరసన్నపేట టీడీపీ మండలాధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, రెడ్డిసతీష్, కింజరాపు రామారావు అచ్చెన్నాయుడుకు కలిసి అభినందించారు.

● **సంతబొమ్మాళి:** పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్, టీడీపీ మండల కార్యదర్శి రెడ్డి అప్పన్న, సువ్వారి ప్రసాద్, మాజీ సర్పంచ్‌లు పరపటి రాజశేఖర్, బుచ్చ మురళీకృష్ణ, సూరాడ రాయుడు తదితరులు మంత్రి అచ్చెన్నాయుడుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

● **ఎల్.ఎన్.పేట:** మంత్రిగా పదవీ బాధ్యతలుచేపట్టిన అచ్చెన్నాయుడును టీడీపీమండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం. మనోహర్‌నాయుడు, కె.చిరంజీవి, నాయకులు వి.ఆనందరావు, ఎం.జగదీశ్వరరావు, కె.భాస్కరరావు, జి. గోవిందరావు అమరావతిలో కలిశారు.

● **సంతబొమ్మాళి:** మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టాలని మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన మంత్రి కొల్లు రవీంద్రను మత్స్యకార మండల నాయకులు సూరాడ ధనరాజ్, వారాధి చంటి, శ్రీరంగం రాజులుకోరారు. గురువారం విజయవాడలో మంత్రి కొల్లు రవీంద్రనుకలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వేటకు వెళ్లిన ప్రతి మత్స్యకారునికి వేట విరామ భృతి అందించడంతోపాటు, వేటకు కావలసిన వలలు, బోట్లు సబ్సిడీపై అందించేందుకు కృషి చేయాలని కోరారు.

● **పలాస:** పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘ నాయకులు, పోలీసులు, రెవెన్యూ, మండల ఉద్యోగులు, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది అభినందించారు. ఆర్డీవో భరత్‌నాయక్, సీఐ విజయానంద్, విద్యుత్ ఉద్యోగుల సంఘం డివిజన్ నాయకులు కె.గిరీశ్వరరావు, గార రాజారావు, హిమగిరి, భాస్కరరావు తో పాటు ఉద్యోగులు కలిశారు.


రణస్థలం: అచ్చెన్నాయుడును అభినందిస్తున్న ఎన్ఈఆర్

● **రణస్థలం/అరసవల్లి :** మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అలాగే అచ్చెన్నాయుడుని జిల్లా బీజేపీ నాయకులు పైడి వేణుగోపాలం, జిల్లా ఇన్‌చార్జి ఎస్.విజయానంద్, పైడి రాజారావు కలుసుకుని అభినందించారు.

విద్యార్థుల బడిబాట

- జిల్లాలో పాఠశాలలు పునః ప్రారంభం
- కిటకిటలాడిన పుస్తకాల దుకాణాలు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు గురువారం పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు బడిబాటపట్టారు. కొందరు తల్లిదండ్రులు తొలిరోజు పాఠశాలలకు విద్యార్థులను తీసుకొచ్చారు. విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో స్టేషనరీ, సామగ్రి కొనుగోలుతో పుస్తకాలు షాపులు కిటకిటలాడాయి. రెండు నెలలుగా సెలవులు కావడంతో పాఠశాల గదులు, పరిసరాలు చెత్తతో నిండిపోయాయి. దీంతో తొలిరోజు శుభ్రంచేయాల్సి వచ్చింది. కొన్నిచోట్ల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, విద్యాకానుక కిట్లను పంపిణీ చేయలేదు. పలు చోట్ల పాఠశాలలు తెరచే నాటికి కూడా నాడు-నేడు పనులు పూర్తిచేయకపో వడంతో ఆరుబయటే పాఠ్యాంశాలు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది.

- ఆంధ్రజ్యోతి బృందం


నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు


పాతపట్నం: విద్యార్థులను పాఠశాలకు తీసుకొస్తున్న తల్లులు


జలుమూరు: విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఉపాధ్యాయులు

గుర్తింపు ఉన్న పాఠశాలల్లో చేర్పించండి

పలాస రూరల్: పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలతో పాటు మండలాల్లో ఉన్న గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించవద్దని పలాస ఎంఈవో సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పలాస ఎంఆర్‌సీ భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని, చేర్చేముందు ఆ పాఠశాలకు గుర్తింపు ఉందో తెలుసుకోవాలని కోరారు.




పలాస: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


ఎల్.ఎన్.పేట: తల్లిదండ్రులకు అవగాహన కలిగిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

- విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు గురువారం ర్యాలీలు నిర్వహించడంతోపాటు విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు.

● **పలాస:** పలాస ప్రభుత్వోన్నత పాఠశాలఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని మొగిలిపాడు వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం దాట్ల దాశరధి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించామని, సరిపడ ఉపాధ్యాయులు ఉండడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం నుంచి మంజూరయ్యే పథకాలన్నీ అందజేస్తామని తెలియజేశారు.

● **ఎల్.ఎన్.పేట:** నాణ్యమైన విద్యను కోరుకునే తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గణపతి మహాపాత్రో తెలిపారు. లక్ష్మీనర్సుపేటలో పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు పాఠశాలలో సౌకర్యాలను వివరించారు. కార్య క్రమంలో ఉపాధ్యాయులు టి.ఉపేంద్ర, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, సంగీతలు పాల్గొన్నారు.



ఎర్ర చెరువు గట్టుపై ఆక్రమణలు తొలగించండి




ఆక్రమణలు తొలగించాలని ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస: ఎర్రచెరువు గట్టు వద్ద సర్వేనెంబరు 29లో ఆక్రమణలు తొలగించి ఆ భూములను శివాలయం అభివృద్ధికి అప్పగించాలని శివాజీనగర్‌కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషకు గురువారం వినతిపత్రం అందించారు. శివాజీనగర్‌లో సామాజిక అవసరాలకు సరైన స్థలాలు లేకపోవడంతో శివాలయం ఎదురుగా ఉన్న స్థలాన్ని వినియోగిస్తున్నామని కాలనీవాసులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పెద్దలు వారి అనుచరులకు ఆ భూమి ధారాదత్తం చేశారని వాపోయారు. అక్కడ నిర్మాణాలు కూడా జరుగుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పనులు తక్షణమే నిలిపివేసి ఆ భూమిని శివాలయానికి అప్పగిస్తే తాము సామాజిక అవసరాలకు విని యోగిస్తామని తెలిపారు. అనంతరం శిరీష ఆర్డీవో భరత్‌నాయక్‌కు ఆక్రమణలు తొలగించాలని వినతిపత్రం అందజేశారు. ఎన్నికల ముందు కూడా ఈవ్యవహారంపై ఫిర్యాదు చేశామని తెలిపారు. దీంతోపాట ఎర్రచెరువు కాలువ కూడా ఆక్రమణలకు గురైందని, మొత్తం తొలగించాలనికోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూ రావు, శివాజీనగర్ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దువ్వాడ అన్నాజీరావు, నారాయణరావుతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

పాతపట్నం: పాతపట్నం పంచాయతీకార్యాలయంలో పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదుమేరకు గురువారం టెక్కలి డీఎల్‌పీవో ఐవీ రమణ విచారణ నిర్వహించారు. ఈ మేరకు నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామనితెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. సీతారాంపల్లి చెత్త నుంచి సంపదతయారీకేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, ఈవోపీఆర్డీ కె.కృష్ణారావు, కార్యదర్శులు కృష్ణంరాజు, రాకేష్, శివప్రసాద్ పాల్గొన్నారు.


విచారణ నిర్వహిస్తున్న రమణ





రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి


సాయిరాం జిన్నా (ఫైల్)

మెళియాపుట్టి: మండలంలోని పద్మ గ్రామానికి చెందిన సాయిరాం జిన్నా(16) గురువారం ఆకులఅమ్మవారి మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. గ్రామానికి చెందిన పరమేష్‌మజ్జి, చొంపామజ్జిలు చెన్నైలో ఉంటున్నారు. వీరికి ఆటోపై గ్రామం నుంచి పలాస రైల్వే స్టేషన్‌కు దిగబెట్టడానికి సాయిరాం జిన్నా బయలుదేరాడు. ఆ సమయంలో ఆకులఅమ్మవారి గుడి మలుపు వద్ద పలాస నుంచి మెళియాపుట్టి వైపువస్తున్న పట్టుపురం గ్రామానికి చెందిన టి.గోవిందరావు ద్విచక్రవాహనం ఆపి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. దగ్గరకు వచ్చే వరకూ ఆయన కనిపించకపోవడంతో హఠాత్తుగా ఆటో బ్రేక్‌వేయాల్సివచ్చింది. దీంతో ఆటో బోల్తాపడడంతో సాయిరాం జిన్నాకు తలకు బలమైన గాయాలయ్యాయి. 108లో చాపర ఆరోగ్యకేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారి పావని తెలిపారు. సాయిరాం జిన్నాకు తల్లిదండ్రులతో పాటు అన్నయ్య ఉన్నాడు. సాయిరాం జిన్నా మృతితో పద్మ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా ఆటోలో ఉన్న చొంపామజ్జి, కోకలేస్ జిన్నాకు గాయాలయ్యాయి. మృతదేహనికి శవపంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదుచేశారు.

పెద్దమురహరిపురంలో విద్యార్థి అదృశ్యం

వజ్రపుకొత్తూరు: పెద్దమురహరిపురం గ్రామానికి చెందిన విద్యార్థి అదృశ్యం కావడంపై కేసునమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. పోలీసుల కథనం మేరకు.. బొంగుమోహనరావు, సరస్వతి కుమారుడు సాయికుమార్ (11) స్థానికంగా ఆరోతరగతి చదువుతున్నాడు. హోంవర్క్ చేయాలని పేర్కొని సాయికుమార్‌ను గ్రామంలోగల కుమార్తె ఇంటివద్ద విడిచిపెట్టి నందిగాం మండలంలోని బంధువుల ఇంటికి తల్లిదండ్రులు వెళ్లారు. ఈ నేపథ్యంలో సాయికుమార్ కనిపించ లేదు. తల్లిదండ్రులు ఇంటికివచ్చి బంధువుల వద్ద గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఇంటి నుంచి పారిపోయినట్లు భావించి గురువారం వజ్రపుకొత్తూరు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు చెప్పారు.

పుస్తకాలు అధిక ధరకు విక్రయంపై నిరసన


పాఠ్యపుస్తకాల గదికి తాళాలు వేస్తున్న ఎంఈవో, ఏబీవీపీ కార్యకర్తలు

టెక్కలి: టెక్కలిలోని ఓ ప్రైవేటు హైస్కూల్‌లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుమేరకు గురువారం ఎంఈవోకు పాఠశాల సందర్శించి పాఠ్యపుస్తకాల గదికి తాళం వేయించారు. అంతకుముందు ఏబీవీపీ కార్య కర్తలు కె.మురళి ఆధ్వర్యంలో ఆ పాఠశాల వద్దకు వెళ్లి పాఠ్యపుస్తకాలు అధిక ధరలకు అమ్మకాలపై నిరసన తెలిపారు. అధికధరలకు పాఠ్యపుస్తకాలు అమ్ముకున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన మండల విద్యాశాఖాధికారి ఈ విషయమై విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు మదన్, విశ్వనాథ్, శ్యామ్, సంతోష్ పాల్గొన్నారు.

బురద చల్లే ప్రయత్నం మానుకోవాలి

- టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు


మాట్లాడుతున్న కామేశ్వరరావుయాదవ్

పలాస: వైసీపీ నాయకులు ఇకనైనా బురదచల్లే ప్రయత్నం మానుకొని అభివృద్ధికి తోడ్పాటనందించాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్ హితవుపలికారు. గురువారం పలాస టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మెగా డీఎస్సీ, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, పేదలకు అన్న క్యాంటీన్లు పునరుద్ధరణ, యువతకు ఉపాధి కోసం స్కిల్ డెవలెప్‌మెంట్, పింఛన్లు పెంచడాన్ని ప్రజలు హర్షిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన విధంగా హామీలు మొదటిరోజే అమలు చేసి రికార్డు సృష్టించారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నాయకులకు హింస పెట్టడంతప్పా వారు చేసిన అభివృద్ధి ఒక్కటి కూడా లేదన్నారు. సమావేశంలో గురిటి సూర్యనారాయణ, రాంబాబు, తాతారావు, లచ్చయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

సముద్రం అల్లకల్లోలం


శివసాగర్ తీరంలో అల్లకల్లోలంగా ఉన్న సముద్రం

వజ్రపుకొత్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం వల్ల సముద్రం రెండురోజులుగా అల్లకల్లోలం గా మారిందని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం వేటనిషేధం వల్ల మత్స్యకారులు చేపలవేటకు వెళ్లడం లేదు. నాటు తెప్పలతో సంప్రదాయ మత్స్యకారులు కూడా చేపలవేట చేయడంలేదు. కానీ శివసాగర్‌తీరంలో పర్యటకులు సముద్రంలో స్నానాలకు దిగుతుండడంతో సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మెరైన్ పోలీసులు గస్తీకాసి పర్యటకులను అప్రమత్తం చేయాలని కోరుతున్నారు.



ఉరుకులు.. పరుగులు

● పాఠశాలలు ప్రారంభం



నగరంలోని మున్సిపల్ పాఠశాలలో ప్రార్థనలు చేస్తున్న విద్యార్థులు

వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు తెరచుకున్నాయి. తొలిరోజు ఉరుకులు.. పరుగులతో విద్యార్థులు పాఠశాలకు చేరుకున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ద్విచక్రవాహనాలపై పాఠశాలలకు తీసుకెళ్లారు. జిల్లాలో ఏ పాఠశాల వద్ద చూసినా సందడి కనిపించింది. - అరసవల్లి/ఆమదాలవలస



యూనిఫారాల్లో పాఠశాలకు చేరుకుంటున్న విద్యార్థులు



ఆమదాలవలస: లక్ష్మీనగర్ ఉన్నత పాఠశాల వద్ద గుమిగూడిన విద్యార్థులు

అనారోగ్యంతో హెచ్‌సీ మృతి



లక్ష్మయ్య (ఫైల్)

శ్రీకాకుళం క్రైం: అనారోగ్యంతో ఓ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పోలాకి మండలం పల్లిపేట గ్రామానికి చెందిన ఆబోతుల లక్ష్మయ్య(57) శ్రీకాకుళం టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో బందోబస్తు నిర్వహించేందుకు విజయవాడ వెళ్లాడు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వచ్చేందుకు విజయవాడ బస్‌స్టేషన్‌కు వెళ్లాడు. అక్కడ అనారోగ్యానికి గురై స్పృహ తప్పి పడిపోయాడు. తోటి పోలీసులు ఆస్పత్రిలో చేర్పించారు. గురువారం వేకువ జామున ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రిలోనే ప్రాణాలు విడిచాడు. లక్ష్మయ్య భౌతికకాయాన్ని గురువారం రాత్రి స్వగ్రామానికి తీసుకువచ్చారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. కాగా, లక్ష్మయ్య ఏఆర్‌లో పని చేసేవాడు. అక్కడ నుంచి కోటబొమ్మాళి పోలీసు స్టేషన్‌లో 2019 నవంబరు వరకు పనిచేసి.. శ్రీకాకుళం టూ టౌన్ పోలీసు స్టేషన్‌కు బదిలీపై వచ్చాడు. లక్ష్మయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

గుండెపోటుతో పీఏసీఎస్ అకౌంటెంట్ మృతి



సుధీర్ (ఫైల్)

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పీఏసీఎస్‌లో అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న సుధీర్ గౌడ్ గురువారం ఉదయం గుండెపోటుతో మరణించాడు. విధి నిర్వహణలో చురుగ్గా ఉండి సకాలంలో పనులు పూర్తి చేసేవాడని కార్యాలయ సిబ్బంది వాపోయారు. మంచి మిత్రుడని కోల్పోయామని సిబ్బంది, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నర్తు నరేంద్ర అన్నారు. ఈ సందర్భంగా మృతిడి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలిపారు. మృతునికి భార్య ఒక పాప ఉన్నారు.

హై వోల్టేజ్‌తో కాలిపోయిన ఫ్యాన్లు, టీవీలు

ఇచ్ఛాపురం: పట్టణ పరిధి విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో గల జర్నలిస్ట్ కాలనీలో హై వోల్టేజ్ రావడంతో ఇళ్లలో టీవీలు, ఫ్యాన్లు కాలిపోయాయి. దీంతో కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఆకస్మికంగా హైఓల్టేజ్ విద్యుత్ సరఫరా కావడంతో ఫ్యాన్లు కాలిపోయాయి. కాలనీలో సరైన విద్యుత్ లైన్ లైకపోవడంతో తరుచూ ఇటువంటి ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ లైన్ సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్ఛాపురం: ప్రభుత్వం స్వయం శక్తి సంఘాలకు అందిస్తున్న వివిద రకాల రుణాలును సద్వినియోగం చేసి ఆర్థిక పరంగా అభివృద్ధి చెందాలని ఏపీఎం సనపల ప్రసాద్ అన్నారు. గురువారం సమైఖ్య కార్యాలయంలో స్వయంశక్తి సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామసంఘాల నుంచి సమాజికి పెట్టుబడి, బ్యాంకుల ద్వారా బ్యాంకు లింకేజ్, శ్రీనిధి రుణాలు తీసుకొనే ముందు రికార్డుల పరిశీలనతోపాటు ఈ రుణాలు వారు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను ఉపయోగించే పద్ధతి గురించి అడిగి తెలుసుకున్నారు. తీసుకున్న రుణాలు ఏమేరకు వినియోగించుకుంటూన్నారో అడిగి తెలుసుకున్నారు. తీసుకున్న రుణాలు చెల్లింపు వాయిదాలు, రికార్డు నిర్వహణ సమావేశాల్లో చెర్చించే విధానం, 100శాతం రుణాలు తిరిగి చెల్లించే విదానంపై అవగహణ కల్పించారు.

మిగులు సీట్ల భర్తీకి ప్రవేశపరీక్ష

పాతపట్నం: స్థానిక ఏపీ మోడల్‌స్కూల్‌లో మిగులు సీట్ల భర్తీకి గురువారం ప్రవేశపరీక్షను నిర్వహించారు. ఏడో తరగతికి 23, ఎనిమిది, తొమ్మిదో తరగతి ప్రవేశపరీక్షకు ఎనిమిది మంది హాజరైనట్టు ప్రిన్సిపాల్ రత్నకుమారి తెలిపారు.

కాలువల్లో పూడికలు తొలగించాలి

హిరమండలం: వంశధార ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువతోపాటు అనుసంధానంగా ఉన్న పిల్ల కాలువల్లో పూడికలు తొలగించాలని జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు గురువారం డ్వామా పీడీ జీవీ చిట్టిబాబును కోరారు. కాలువల నిర్వహణ లేకపోవడంతో పూడిక పేరుకుపోయిని, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందువల్ల తక్షణమే కాలువలు బాగుచేయాలని కోరారు.

బోధనలో కీలక పాత్ర పోషించాలి

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు బోధనలో కీలకమైన పాత్ర పోషించాలని హెచ్‌ఎం వెంకట్రావు సూచించారు. గురువారం స్థానిక పాఠశాల ఆవరణలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయ సంఘ డైరీను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘనాయకులు శ్రీనివాసశర్మ, కొండాల లత పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు

ఎల్.ఎన్.పేట: వాతావరణంలో వచ్చే మార్పులకు అనుగుణంగా, సీజనల్‌గా వచ్చే వ్యాధులను నివారించేం దుకు ముందు జాగ్రత్తగా శాఖాపరంగా చర్యలు చేపడతామని వైద్యాధికా రులు ప్రియాంక, సునీత తెలిపారు. గురువారం లక్ష్మీనర్సుపేట సాంఘిక సంక్షేమ బాలుర వస తి గృహం, కేజీబీవీ పాఠశాలలో దోమల వల్ల వచ్చే వ్యాధు లను నివారించేందుకు అల్ఫామిథైన్ పిచికారీచేశారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

పర్లాకిమిడి: విపత్తులు తట్టుకోవడం, ప్రాణ నష్టాన్ని తగ్గించటం వంటి వాటిపై అవగాహన కల్పించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. గురువారం జడ్పీ కార్యాలయంలో జిల్లా స్థాయి ప్రకృత వైపరీత్యాల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలను ఎలా ఎదుర్కోవాలో అవగాహన అవసరమన్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో విపత్తులను ఎదుర్కొనేందుకు మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. జిల్లా విపత్తుల శాఖ నిర్వహణ అధికారి ప్రదోష కుమార్ శతపతి.. వరదలు, పిడుగులు, అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ గవర తిరుపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


రాష్ట్రానికి స్వర్ణయుగం



సందండి చేస్తున్న బీజేపీ నాయకులు

పర్లాకిమిడి: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా పార్టీ నాయకులంతా సంబరాలు జరుపుకున్నారు. గురువారం పట్టణంలో కార్యకర్తలు బాణ సంచా కాలుస్తూ సందడి చేశారు. బీజేడీ పాలనలో 25 ఏళ్లగా రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. నేడు బీజేపీ పాలనలో స్వర్ణయుగం కానుందన్నారు.

నామనగడ గ్రామాన్ని అభివృద్ధి చేస్తా



గ్రామస్థులతో ఎమ్మెల్యే రూపేష్‌కుమార్

పర్లాకిమిడి: గుమ్మా సమితిలో గల నామనగడ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తానని కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే రూపేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యర్తలకు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జగన్నాథస్వామి ఆలయంలో పూజలు జరిపారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేడీ నాయకులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌నాయుడుకు అభినందనలు



కేంద్ర మంత్రి రామ్మోహన్‌ను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

ఎచ్చెర్ల: కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కింజరాపు రామ్మోహన్ నాయుడును ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం అమరావతిలో గురువారం కలిసి అభినందించారు. జిల్లా అభివృద్ధితో పాటు భోగాపురం విమానాశ్రయం త్వరిత గతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రిని కోరారు.

పవన్‌కల్యాణ్‌ను కలిసిన జనసేన పార్టీ ఇన్‌చార్జి



పవన్‌కల్యాణ్‌కు సత్కరిస్తున్న రామ్మోహన్‌రావు

ఆమదాలవలస: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను ఆమదాలవలస నియోజకవర్గ ఆ పార్టీ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్ రావు మర్యాదపూ ర్వకంగా కలుసుకున్నారు. గురువారం మంగళగిరిలో ని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలుసుకుని పవన్‌కల్యాణ్‌ను శాలువతో సత్కరించి, పొందూరు ఖద్దర్‌ను అందించారు.

పవన్‌ను కలిసిన టీడీపీ నాయకులు

పొందూరు: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను గురువారం మండల టీడీపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా తెలుగు యువత కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి లోలుగు వెంకట్ విజయవాడలో పవన్ నివాసంలో కలిశారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి: ఎమ్మెల్యే గొండు

అరసవల్లి: శ్రీకాకుళం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గొండు శంకర్ తన కార్యాచరణను ప్రారంభించారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నగరానికి చేరుకున్న శంకర్‌ను ఆయన కార్యాలయంలో గురువారం నియోజకవర్గ ప్రజలు కలుసుకుని తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ సమస్యలపై సంబంధిత అధికారులతో అప్పటికప్పుడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ఇకపై ప్రజా క్షేత్రంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన లక్ష్యమన్నారు.

అధికారులను కలిసి..

సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యేగా జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో ఘనవిజయం సాధించిన ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నియోజకవర్గానికి విచ్చేసిన సందర్భంగా గురువారం పలువురు అధికారులను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, ఆర్డీవో ఎం.గణపతిరావు, నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియాలను కలుసుకుని నగరంలోని పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా శంకర్‌ను అధికారులు అభినందించారు.



ఎమ్మెల్యే గొండు శంకర్‌ను అభినందిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

ఎస్పీ అభినందన

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఎస్పీ జీఆర్ రాధికను గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రాధిక ఎమ్మెల్యే శంకర్‌ను పుష్పగుచ్ఛంతో అభినందించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా..

శ్రీకాకుళం రూరల్: సంప్రదాయ గురుకులాన్ని గొప్ప పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. రూరల్ మండలం కళ్లేపల్లిలోని సంప్రదాయ గురుకులంలో డైరెక్టర్ స్వాతి సోమనాథ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను గురుకులం నిర్వాహకులు సత్కరించారు. నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థినులను గొండు శంకర్, గౌరవ అతిథి దానేటి శ్రీధర్ సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మూకళ్ల శ్రీనివాసరావు, సాధు శ్రీనివాసరావు, జయానంద్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ పదవికి రాజీనామా

అరసవల్లి: శ్రీకాకుళం రూరల్ మండలం, కృష్ణప్పేట సర్పంచ్‌గా ఉన్న గొండు శంకర్ ఇటీవల జరిగిన సార్వత్రిక శ్రీకాకుళం నియోజకవర్గ నుంచి టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. దీంతో సర్పంచ్ పదవికి ఆయన రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని డీపీవో వెంకటేశ్వరరావుకు గురువారం అందజేశారు.

అపరిచిత వ్యక్తులపై సమాచారం ఇవ్వండి

బూర్జ: అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సీఐ దివాకర్ యాదవ్ కోరారు. ఈ మేరకు గురువారం బూర్జ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల దొంగతనాలు ఎక్కువగా అయ్యాయన్నారు. ప్రజలు బంగారం, తదితర విలువైన వస్తువులు జాగ్రత్త చేసుకవాలని సూచించారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. ఇటీవల లచ్చయ్యపేట, ఏటీసీపేటల్లో పుస్తెలతాళ్ల చోరీ జరిగిన కేసులో దొంగతనం చేసిన వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఇప్పటివరకు నమోదైన చోరీ కేసులపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈయనతోపాటు ఎస్ఐ ప్రసాద్ ఉన్నారు.

సమాజంపై అవగాహన ఉండాలి

ఆమదాలవలస: యువత సమాజంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్ అన్నారు. గురువారం పురపాలక సంఘ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థుల విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో పాల్గొని రాజకీయ అర్థశాస్త్రంపై విద్యార్థులకు వివరించారు. సమాజ మార్పులో వివిధ ఉత్పత్తి విధానాలు వస్తూ సరుకు లక్షణాల ప్రత్యేకతలు పెట్టుబడిదారి ఉత్పత్తి విధానం, అదనపు విలువ ఎలా ఏర్పడుతుంది, అదనపు విలువ పెంచుకొనే పద్ధతులు, దోపిడీదారుల మధ్య పంపిణీ, సంక్షోభాలు సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ.. తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పావని, జిల్లా అధ్యక్షుడు చందు, జిల్లా ప్రధాన కార్యదర్శి హరీష్, సహాయ కార్యదర్శి సంతోష్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయ సీనియర్ అసిస్టెంట్ మాతృశాఖకు సరెండర్

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కృష్ణమాచార్యులను మాతృసంస్థకు సరెండర్ చేస్తూ దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. విశాఖ జిల్లా పెదవాల్తేరులో గల కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయానికి తిరిగి పంపించారు. కృష్ణమాచార్యులపై ఫిర్యాదులు రావడంతో ఆయనను మాతృశాఖకు సరెండర్ చేసినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

షిర్డీ సాయికి పల్లకి సేవ



పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: విశాఖ-బీ కాలనీలో ఉన్న షిర్డీ సాయి మందిరంలో గురువారం పల్లకి సేవ నిర్వహించారు. పాలాభిషేకం, కాగడా హారతి, స్వామి వారికి పూలతో అలంకరణ, నూతన వస్త్రాలతో అలంకరణ చేపట్టారు. ఆలయ ధర్మకర్త కొంక్యాణ మురళి ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఎన్నికల స్ట్రాంగ్ రూము పరిశీలన

పాతపట్నం: స్థానిక వ్యవసాయమార్కెట్ యార్డ్‌లో గల ఎన్నికల స్ట్రాంగ్ రూమును టెక్కలి సబ్ కలెక్టర్ నూరల్ కమర్ గురువారం పరిశీలించారు. ఆయనవెంట తహసీల్దార్ ప్రసాదరావు, సీఎస్‌డీటీ భీమారావు పాల్గొన్నారు.

టీడీపీ విజయోత్సవం



కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఇచ్ఛాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతులు చేపట్టడంపై 16వ వార్డులో టీడీపీ కార్యకర్తలు, నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే బెందాళం అశోక్, కేంద్రమంత్రి పదవి దక్కించుకున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు అభినందనలు తెలిపారు. వార్డు మాజీ కౌన్సిలర్ నాగరాజు పాత్రో ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు కేక్‌కట్ చేసి, బాణ సంచా కాల్చి సందడి చేశారు. కార్యక్రమంలో దిలీప్, రవి, శ్యాం, రవి బైరప్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనం విజయవంతం చేయాలి

సోంపేట: ఈ నెల 19న హైదరాబాదులో హిందూస్ ఫర్ ప్యూరాలిటీ అండ్ ఈక్వాలిటీ(హచ్‌పీఈ) ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మేళనం విజయవంతం చేయాలని సంస్థ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈమేరకు మండలం బాతుపురం గ్రామంలో పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో అలేక్ స్వామిసాధు విజాయనంద, దేవేంద్ర, అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర్ స్వామి, హెచ్‌పీఈ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసియోధ దాస్, జైభారత్ జాతీయ అధికార ప్రతినిధి మల్లికా వల్లభ్ తదితరులు ఉన్నారు.

రూ.300 ఉపాధి వేతనం పొందాలి

గార: ఉపాధి వేతనదారులు రూ.300 వేతనం పొందేలా ప్రతి రోజూ పని చేయాలని డ్వామా పీడీ చిట్టిరాజు అన్నారు. గురువారం ఆయన అంబటి ఎరుకువానిపేట, మంగళవారం పేట, గోరువానిపేట, రామకృష్ణాపురం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి వేతనదారులుతో మాట్లాడారు. ఏపీవో సంధ్యారాణి, జేఈ నారన్నాయుడు, టీఏలు ఉన్నారు.

వసతి గృహంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి పల్లెనిద్ర

లావేరు: తాను చదువుకున్న హాస్టల్‌లో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గురువారం రాత్రి పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన నేను లావేరు మండలం మెట్టవలస వెనుకబడిన తరగతుల వసతి గృహంలో ఉంటూ 5వ తరగత నుంచి పదో తరగతి వరకు చదువుకున్నానన్నారు. ఈ స్థాయికి ఎదగడానికి గల కారణమైన ఈ వసతి గృహాన్ని ఎప్పటికీ తాను మర్చిపోనంటూ ఆ నాటి జ్ఞాపకాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. వేసవి సెలవులు అనంతరం వసతిగృహం పునః ప్రారంభం రోజున అక్కడి చదువుతున్న విద్యార్థులతో కలిసి కలిశెట్టి నిద్రపోయారు. తాను చదువుకున్న ఈ వసతి గృహం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్, కలిశెట్టి సోదరుడు సూర్యనారాయణ, స్థానిక వసతి గృహం అధికారి రమేష్, బుడతవలస ఎంపీటీసీ ముల్లు సాయి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, తామాడ మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆశీలు వేలం పాట

హిరమండలం: హిరమండలం పంచాయతీ రోజువారి ఆశీల వేలం పాటను గురువారం ఈవోపీఆర్‌డీ నాగమణి నిర్వహించారు. 13 మంది పాల్గొనగా సుభలయకి చెందిన పాత్రుని విశ్వనాథం రూ.5.40 లక్షలకు దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈసారి రూ.లక్ష తగ్గింది. కార్యక్రమంలో ఈవో వైఎస్ఆర్ మూర్తి,సర్పంచ్ సుందరమ్మ పాల్గొన్నారు.

న్యాయవాదుల హర్షం

అరసవల్లి: ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుపై బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ చట్టం ప్రజా కంటకమని, దీనిని రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదుల అసోసియేషన్ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టినా, వైసీపీ ప్రభుత్వం గుడ్డిగా చట్టాన్ని అమలు చేసి, ఎన్నికల్లో ఘోర పరాభవం పొందిందన్నారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ చట్టం రద్దులో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టడమే ధ్యేయం

రణస్థలం: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడమే ధ్యేయమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా చంద్రబాబు తొలిసంతకం మెగా డీఎస్సీ, సామాజిక పింఛన్ పెంపు పెంపు, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, అన్న కేంటీన్ పునరుద్దరణ, నైపుణ్య గణన ఫైళ్లపై సంతకాలు చేశారన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కష్టపడే వ్యక్తి చంద్రబాబునాయుడని, ప్రజలు గుర్తి మళ్లీ అధికారంలో కూర్చో పెట్టారన్నారు. ప్రజల రుణం తీర్చు కోవడానికి సైనికునివలే పనిచేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రణస్థలం: కోష్ట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని డీఈ ఎస్.బయ్యన్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతు నేపథ్యంలో కోష్ట, వల్లభరావుపేట, వెంకటరావుపేట, పల్లిపేట, పైడిపేట, పతివాడపాలెం, పిషని, నెలివాడ, చిల్లపేటరాజం గ్రామాల పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

16న ప్రవేశ పరీక్ష

ఇచ్ఛాపురం: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పురుషోత్తపురం ఏపీ ఆదర్శ పాఠశాలలో 7, 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీకి ప్రవేశ పరీక్ష ఈ నెల 16న నిర్వహిస్తున్నామని దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని పాఠశాల ప్రిన్సిపాల్ వైకుంఠరావు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఆ రోజు ఉదయం 10గంటలకు పాఠశాల ఆవరణలో నిర్వహిస్తామన్నారు.

జీవో నెం.117 రద్దు చేయాలి

ఇచ్ఛాపురం: రాష్ట్రం ఏర్పాటైన కొత్త ప్రభుత్వం తక్షణమే జీవో నెం.117ను రద్దు చేసి విద్యా వ్యవస్థకు పునర్వైభవం తీసుకురావాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కీల సోమేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. విజ్ఞత కలిగిన ప్రభుత్వంగా పేరుతెచ్చుకోవాలంటే క్యూబా దేశం మాదిరిగా ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:12గా నిర్దేశించి ప్రభుత్వ బడులను పటిష్ట పరచాలని కోరారు. 2014-19 అధికారంలో ఉన్న అప్పటి టీడీపీ ప్రభుత్వ కాలంలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:20గా అమలు జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

గెస్ట్ ఫ్యాకల్టీల నియామకానికి వాక్ ఇన్ ఇంటర్వ్యూ

గార: వమరవెల్లిలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరం కోసం ఇంగ్లిష్, సోషల్ సైన్స్ గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన మహిళా అభ్యర్థులను వాక్ ఇన్ ఇంటర్వ్యూ డెమో ద్వారా ఎంపిక చేయనున్నట్టు ప్రిన్సిపాల్ చిట్టితల్లి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు వారి బయోడేటా పీజీ, బీఈడీ, టీఈటీ ఒరిజినల్ సర్టిఫికేట్లతో నేరుగా పాఠశాలలో హాజరు కావాలన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

రణస్థలం: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని డీఈవో కె.వెంకటరావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువతున్న విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో మంచి శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

18న శ్రీకూర్మం గ్రామ దేవత ఉత్సవం



మోహినీ భద్రాంబిక అమ్మవారు

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మం గ్రామ దేవత మోహినీ భద్రాంబిక అమ్మవారి పండుగ (ఉత్సవం) ఈ నెల 18వ తేదీ మంగళవారం వైభవంగా నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన దేవరను తీసుకురా వడం జరిగిందని, 18న అమ్మవారి అనుపు ఉత్సవం చేప ట్టనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ వేషధారణ లు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపా రు. మంగళవారం మధ్యాహ్నం పూర్ణ కలశాలతో ఊరేగిం పుగా గ్రామ దేవత గుడివద్దకి వెళ్లి చల్లదనం చేయనున్నట్టు తెలిపారు.